# జాలి

చిలకలపూడి సత్యనారాయణ

"లేవండి. టైము ఏడు దాటింది" అన్న భార్య పిలుపుతో ఒక్క ఉదుటున నిద్ర మంచం మీద నుంచి లేచి, గబగబా కాలకృత్యాలు కానిచ్చుకుని, భార్య ఇచ్చిన కాఫీ తాగి, బీరువా లోంచి రాత్రి సర్దుకున్న పర్స్ తీసుకుని, వేగంగా రోడ్డు మీద కొచ్చి రిక్షా కేకేసి రైల్వే స్టేషన్‌కి పోనీమన్నాను.

రిక్షావాడు పదిహేను నిమిషాలలో రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్ళాడు. రిక్షా వాడికి డబ్బు లిచ్చి పరుగెత్తినట్టు వెళ్ళి చూస్తే, నా లాంటి వాళ్ళు పదిహేనుమంది అప్పటికే ఇంకా తెరవని రిజర్వేషన్ కౌంటర్ దగ్గర నిలబడున్నారు.

వేసవి కాలం సెలవులు కదా అని భార్యని, పిల్లలని మద్రాసు పంపిద్దా మని రిజర్వేషన్‌కి పొద్దున్నే వెడితే 'క్యూ' ఉండదని అనుకున్నాను. నాలాగే ఆలోచించిన వాళ్ళు చాలామంది నాకంటే ముందుగా వచ్చేశారు. చేసేది లేక పదహారో వాడుగా 'క్యూ'లో నిలబడ్డాను. రిజర్వేషన్ ఫారం నా ఫ్రెండు దగ్గ రుంటే ముందే పూర్తి చేసి తీసుకురావటం వలన ఆ బాధ తప్పింది.

ఫాన్‌లు తిరుగుతున్నా ఒంటి నిండా చెమట పడుతోంది. నాకే కాదు అందరికీను. చిరాకుగా ఉంది. కౌంటర్ తెరవటానికి ఇంకో అరగంట ఉంది.

ముందు నుంచున్నాయన దగ్గర పేపరుంటే అడిగి తీసుకుని, హెడ్ లైన్స్ చూశాను. మామూలే! చదవా లనిపించక పేపర్ తిరి గిస్తూ వెనక్కి తిరిగి చూశాను. నా వెనుక ఇంకో పదిహేనుమంది దాకా చేరారు. "వేసం కాలం సెలవులు కదా! కౌంటర్ అరగంట ముందు తెరిస్తే బాగుండు" అనుకుంటుండగా "సార్!" అని పిలిచారు.

వెనక్కి తిరిగి చూశాను. ముప్పై ఏళ్ళ ఒకతను "నాకు కళ్ళు కనబడవు. ఈ ఫారం కొంచెం పూర్తి చేసిస్తారా?" అని అడిగాడు.

అతని ముఖం వైపు ఒకసారి చూశాను. అతని కళ్ళలో పాపలు నల్లగా లేవు. తెల్లగా ఉన్నాయి. బాగా నీరసంగా కనబడుతున్నాడు. 'జీవితం అనుభవించాల్సిన వయసులో ఇలా గుడ్డివాడుగా ... నిజంగా ఆ దేవుడికి హృదయం లేదు' అనుకుని మరొకసారి అతని ముఖంలోకి చూశాను. అతన్ని చూస్తే "పాపం!" నాకు జాలేసింది. వెంటనే అతని చేతిలో ఉన్న ఫారం తీసుకుని పూర్తి చేసి ఇచ్చాను.

నా దగ్గర ఫారం తీసుకుంటూ - "సార్! చాలామంది ఉన్నారా క్యూలో?" అని అడిగాడు.

"ఆఁ ముప్పైమంది దాకా ఉంటారు" అన్నాను.

"సార్! పిల్లలని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలి. తొమ్మిదింటి లోపల వెళ్ళకపోతే డాక్టర్ వెళ్ళిపోతా డు. 'క్యూ'లో నిలబడితే టైమైపోతుంది. దయచేసి నా క్కూడా రిజర్వే చేసి పెడతా రా?" అని అడిగాడు.

అతను చెప్పింది విని అతని మీద ఇంకా జాలి పెరిగింది. 'డాక్టర్ దగ్గరకు పిల్లలని తీసుకెళ్ళాలట. పాపం ఏం జబ్బో!' అనుకుని, "రైల్వే వాళ్ళు ఇబ్బందికరమైన రూల్ పెట్టారుగా. రెండు ఫారాలు ఒక మనిషి దగ్గర తీసుకోరు. అందుకని నాతో మాట్లాడుతున్నట్టు నటించి నా ముందు చేరిపో. ఎవరైనా అడిగితే నువ్వు నా ముందు నిలబడ్డా వని చెప్తాను" అని గుడ్డివాడికి సలహా ఇచ్చి ఎవరైనా ఏమన్నా అంటారేమో అని భయపడి ఎటో చూస్తున్నట్టు నిలబడ్డాను.

ఆ గుడ్డివాడికి ముందు, వెనుకలు కనబడక నా ముందు నిలబడాల్సింది పోయి నా వెనుక నిలబడ్డాడు.

"ఎవరు లైన్లో దూరింది? మేమంత మనుషుల్లాగా కనబడం లేదా? రండి బయటకు! వచ్చి క్యూలో నిలబడండి" వెనకనుంచి ఒక రిద్దరు అరిచారు.

అంతకుముందు నా వెనుక నుంచున్నాయన గుడ్డి వాడితో "పో! వెళ్ళి వెనక క్యూలో నిలబడు" అని చెప్పాడు.

వెంటనే నేను కలుగజేసుకుని - "పాపం! గుడ్డివాడు సార్! అందులోనూ పిల్లలని తొమ్మిదింటి లోపల హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళాలట. నిలబడనివ్వండి సార్!" అన్నాను.

నాలాగే అతను కూడా మంచివాడులా ఉన్నాడు. "సరే!" అన్నాడు.

వెనక నుంచి చాలామంది "బయటకు రా!" అని అరుస్తున్నారు.

ఇంతలో రైల్వే పోలీ సాయన వచ్చాడు. వెనుక ఉన్న చాలామంది గుడ్డి వాడిని చూపుతూ "అతను మధ్యలో దూరాడు సార్!" అని కంప్లైంట్ చేశారు.

### ఆంధ్రప్రభ ★
### సంక్రాంతి సంబరాలు

చలి కొక దుప్పటి, గిలి కొక దుప్పటి. మనిషి కొక దుప్పటి, మనసు కొక దుప్పటి. ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కప్పుడు కప్పేది కా దిది.

ఇది ఒక ముసిలాడి అంతరంగానికి ఎస్. కోదండ రామిరెడ్డి తీసిన ఎక్స్‌రే చిత్ర కథ

### ★ కొత్త దుప్పటి

వెంటనే ఆ పోలీసు గుడ్డివాడి రెక్క పుచ్చుకుని బయటకు లాగి "వెళ్ళి వెనుక క్యూలో నిలబడు" అని తరిమాడు.

నాకు ఒళ్ళో మండిపోయింది. దేముడికైనా కొంచెం హృదయ ముంటుంది గాని, పోలీసోళ్ళకి అసలు హృదయమే ఉండదు అనుకుంటూ "సార్! అతను గుడ్డివాడు. అతన్ని ఉండనీయండి" అన్నాను.

"మీకు తెలియదు సార్! ఇలాంటి వాళ్ళని చాలామందిని చూశాను. చాలామంది గుడ్డివాళ్ళలాగా నటిస్తారు. ఆ బాపతులాగానే ఉన్నాడు. ఏం పాపం చేశాడో గుడ్డి వా డయ్యాడు, అంతమాత్రాన లైనులో దూరితే వెనుకవాళ్ళు ఒప్పుకుంటారా? వెనుక ఉండుంటే మీరు ఒప్పుకోరు" అని నాతో చెప్పి, ఇంకా అక్కడే నిలబడ్డ గుడ్డివాడిని చూసి "పో! క్యూలో నిలబడు!" అని భుజం పుచ్చుకుని తోశాడు పోలీసు.

అంగవికలుడైన సాటి మనిషి మీద జాలి చూపకుండా కఠినంగా మాట్లాడిన పోలీసాయన్ని చంపేయాలన్నంత కోపం వచ్చింది. "అది కాదు సార్!" అని ఏదో చెప్పబోతున్న నాతో, అక్కడే నిలబడ్డ గుడ్డివాడు "వద్దు సార్! నేను వెనుక నిలబడతా ను" అన్ని నన్ను పోలీసాయనతో గొడవ పడద్దని వారించాడు.

గుడ్డివాడు వెనుక నిలబడటానికి వెనక్కు వెళ్ళాడు. పోలీసాయన పక్క కౌంటర్ దగ్గర కెళ్ళబోతుంటే ఆయనకు వినబడేటట్లు "పోలీసోళ్ళు కఠిన హృదయులని చెపితే నమ్మలేదు. ఇప్పుడు చూశాను" అన్నాను.

వెనక్కి తిరిగి నా వంక ఒకసారి చూసి, తనని కా దన్నట్లు వెళ్ళిపోయాడు పోలీసాయన.

'ఛీ! ఈ దేశం బాగుపడదు' అనుకుని ఎలాగైనా ఆ గుడ్డివాడికి సహాయం చేయాలని అనిపించి వెనక్కి తిరిగి చూశాను. గుడ్డివాడు క్యూలో లేడు. 'బహుశా వెళ్ళిపోయుంటాడు క్యూలో నిలబడితే పిల్లలని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళ లేకపోవచ్చు నని వెళ్ళిపోయుంటాడు' అని అనుకుంటుండగా, నా వెనుక నిలబడ్డ ఆయన "ముందుకు జరగండి" అన్నాడు. అప్పుడు చూశాను 'క్యూ' ముందుకు జరిగిందని. అప్పటికే ఒకళ్ళిద్దరికి టికెట్స్ ఇష్యూ చేసినట్టున్నారు.

'క్యూ'లో ముందుకు జరుగుతూ, 'ప్రజలు అంగవికలులైన సాటి మనుషులకు సహాయం



చేయాలని ఎత్తి చూపే కథని రాయాలని, అందులో అర్థం చేసుకొని, కఠిన హృదయులైన పోలీసు వారిని దుమ్మెత్తి పోయాలని' అనుకుంటున్న నేను కౌంటర్ దగ్గరకి చాలా దగ్గరగా వచ్చేను. 'టికెట్టుకు సరిపడు డబ్బు ఇవ్వవలెను. టెండర్ ఎగ్జాక్ట్ ఫేర్' అని రాసున్న బోర్డు చూసి డబ్బు తీసుకుందామని పేంటు జేబులోకి చెయ్యి పోనిచ్చాను. అంతే! గుండె గుభేలు మంది!

"నా పర్స్! నా పర్స్ పోయిందని" అరిచాను. కొంతమంది నా చుట్టూ చూశారు. నా చుట్టూ గుమిగూడారు.

"నా పర్స్ పోయింది. నిన్ననే జీతం తీసుకుని టికెట్లకని మూడొందలు, ఇంటికెళ్ళే దారిలో పచారీ కొట్లో మూడొంధలు ఇవ్వాలని ఆ రొందలు పట్టుకొచ్చాను. పోయింది" అని వాళ్ళకు వివరించి, కింద ఎక్కడన్నా పడిందేమో నని క్యూలో వెతికాను. కనబడలేదు.

"మీ రేమన్నా చూశారా?" అని నా వెనుక నిలబడ్డ ఆయన్ని అడిగాను.

"లేదే!" అని ఆయ ననడంతో నా కేడుపొచ్చింది. ఎక్కడ పోయుంటుం దని ఆలోచిస్తున్న నాకు 'రిక్షాలో పడిపోయిం దేమో అని' అనుమాన మొచ్చి స్టేషన్ బయటున్న రిక్షా స్టాండ్‌కి వెళ్ళాను. అక్కడ ఇందాక నే నొచ్చిన రిక్షావాడు కనబడలేదు.

"మళ్ళీ ఒకసారి స్టేషన్‌లో చూద్దాం" అని స్టేషన్‌లోకి వెళ్ళాను. అందరూ నా వైపు జాలిగా చూశారు. అంతే నా మీద నాకే కోపం వచ్చింది. అంత డబ్బుంటే జాగ్రత్త చేసుకోలేని నా కేర్‌లెస్‌నెస్‌కి సిగ్గుపడ్డాను. నన్ను నేను తిట్టుకున్నాను. చేసేది లేక నీరసంగా బయటకు నాలు గడుగులు గేసిన నాకు, ఇందాకటి పోలీసాయన గుడ్డివాడిని చొక్కా పుచ్చుకుని తీసుకురావటం కనబడింది.

పోలీసాయన తిన్నగా నా దగ్గర కొచ్చి "ఇది మీ పర్సేనా?" అని నా పర్స్ చూపించి అడిగాడు.

"అవును" అంటూ గబుక్కున నా పర్స్ లాక్కుని, డబ్బు లున్నాయో, లేదో నని చూశాను. ఆ రొందలూ అలాగే ఉన్నాయి. సంతోషంతో "థాంక్స్ అండీ!" అన్నాను.

"ఇప్పుడు చెప్తారు థాంక్స్ అని! ఇందాక కఠిన హృదయులు జాలి లేని వాళ్ళని తిట్టారుగా? మీ వెనక చేరి, మీరు జాలి చూపుతుంటే మీ పర్స్ కొట్టేశాడు ఈ గుడ్డివాడు. వెనక క్యూలో నిలబడకుండా బయటి కెళ్తుంటే అనుమానం వచ్చి పట్టుకున్నాను" అని పోలీసాయన అంటుంటే గుడ్డివాడిని చూసి ఆశ్చర్యపోయాను.

"రా!" అని గుడ్డివాడిని పోలీసాయన తీసుకెళుతుంటే, "సారీ సార్!" అని చెప్పి పర్స్ చేత్తోనే పట్టుకుని మళ్ళీ 'క్యూ'లో నిలబడ్డాను. ★